క్లుప్తంగా

చెస్ పోటీల్లో ఓక్ బ్రిడ్జి విద్యార్థుల విజయకేతనం



మాచర్ల రూరల్: కృష్ణాష్టమి పండగ పురస్కరించుకుని తెలుగు స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ వారు గుంటూరులో నిర్వహించిన పోటీలలో ఓక్ బ్రిడ్జ్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ లక్ష్మి తెలిపారు. రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్‌లో యు.ఎ.19లో పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి తీర్థు, 8వ తరగతి అయన్, 3వ తరగతి బాలబోయిన కృష్ణసాయి గౌతమ్‌లు బహుమతులు సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలూ అవసరమని వారి మానసిక, శారీరక దృఢత్వానికి, మైండ్ గేమ్ చెస్‌లో ప్రావీణ్యం సాధించటం పట్ల ఆమె చెస్ కోచ్ కిరణ్‌ని అభినందించారు.

శ్రీకృష్ణుని అడుగుజాడల్లో పయనిద్దాం

మాచర్ల రూరల్: మానవాళికి గీతా సారాంశం, కర్తవ్య బోధన చేసి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం కృష్ణావతారంలో జన్మించిన శ్రీమహావిష్ణువు అడుగుజాడల్లో పయనిద్దామని భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కొప్పునూరు, తాళ్ళపల్లి గ్రామాలలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో యాదవ సంఘం ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ గొర్రె వెంకటేశ్వర్లు, రిటైర్డ్ డిప్యూటీ డీఈవో గాదె రామకృష్ణారావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జింకల నాగేశ్వరరావు, బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ గుండాల సైదులు యాదవ్, సర్పంచ్ నోముల కృష్ణ, యాదవ సంఘ నాయకులు పెరుమాళ్ళ వెంకట్రామయ్య, రాజబోయిన మధు, గుండాల శ్రీనివాసరావు, ముళ్ళా శ్రీనివాసరావు, నేరేటి వీరాస్వామి తదితరులున్నారు.

ఈ-పాస్ యంత్రాలతో ఎరువులు అమ్మకాలు చేయాలి

ఏడీఏ రవిబాబు

శావల్యాపురం: ఖరీఫ్ సీజను ప్రారంభం నుంచి ఎరువుల డీలర్లు ఈపాస్ యంత్రాల ద్వారానే రైతులకు ఎరువులు పంపిణీ చేయాలని ఏడీఏ బోయపాటి రవిబాబు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు పట్టాదారుపాసు పుస్తకానికి ఆధార్ నంబరు అనుసంధానం చేయించాలన్నారు. భూసార పరీక్ష పత్రాల విశ్లేషణ ఫలితాల ఆధారంగా రైతుల ఎరువులు వాడుకోవాలన్నారు. రైతులు అనవసరంగా రసాయనిక ఎరువులను ఎక్కువ మోతాదులో వాడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. రసాయనిక ఎరువులు వాడకం వల్ల పెట్టుబడులు పెరుగుతాయన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎరువులు పురుగు మందులను వాడినట్లయితే తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు సాధించ వచ్చునన్నారు. ఎరువులు కొరత లేదని, ఎరువులు అమ్మే డీలర్లు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరంగా అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులకు తావులేకుండా పారదర్శకంగా ఎరువులు అమ్మకాలను డీలర్లు చేయాలన్నారు.

కనుల పండువగా కృష్ణాష్టమి



మాచర్ల రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని పట్టణంలోని ఓక్ బ్రిడ్జి స్కూల్‌లో వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఆటపాటలతో చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. విద్యా సంస్థల అధిపతి కొమ్మారెడ్డి చలమారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల కృష్ణుడిగా, గోపికలుగా వేషధారణలు.. కృష్ణుని చిలిపి చేష్టలను చక్కని నృత్యాలు, ఆటపాటలతో విద్యార్థులు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ షేక్ దరియావలి, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

చిలకలూరిపేట టౌన్: ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని పాఠశాల బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అప్పాపురం గ్రామానికి చెందిన దుప్పలపూడి శివబాబు (43) సోమవారం వ్యక్తిగత పనులపై చిలకలూరిపేటకు ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా నరసరావుపేట ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి. అప్పాపురం వైపు మలుపు తిప్పే క్రమంలో ఎదురుగా వచ్చిన బస్సు ఢీకొంది. తీవ్ర గాయాలైన శివ బాబును ఆటోలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి




ప్రాణాలు కాపాడే వైద్య వృత్తిలో ఉన్న మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి. కోల్‌కతాలో జూనియర్ వైద్యాధికారిణిపై దారుణానికి పాల్పడిన నిందితులకు వేసే శిక్ష మరొకరు ఇలాంటి చర్యలకు పాల్పడాలంటేనే భయపడేలా ఉండాలి. మహిళలు, బాలికల రక్షణకు ప్రభుత్వాలు చట్టాలలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉంది.

– ప్రమీల, ఆరోగ్య కార్యకర్త, రెంటచింతల పీహెచ్‌సీ



నిందితులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి. వైద్యులు అంటే ప్రాణాలను కాపాడే వారని ప్రజలంతా నమ్ముతారు. అలాంటిది మహిళా వైద్యులపై దుర్మార్గపు చర్యలకు పాల్పడడం హేయం. భవిష్యత్‌లో ఎవరూ ఇటువంటి చర్యలకు పాల్పడకుండా నిందితులకు దేశమంతా ఉలిక్కి పడేలా కఠినమైన శిక్ష వెంటనే విధించాలి.

– డాక్టర్ బుర్రి వెంగళరెడ్డి, (ఐఎంఏ సభ్యులు), అభయ హాస్పిటల్, పిడుగురాళ్ల

అంగరంగ వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

పిడుగురాళ్ల: కృష్ణాష్టమి పురస్కరించుకొని పట్టణంలోని టీడీపీ కల్యాణ మండపం వద్ద కృష్ణాష్టమి వేడుకలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదికల ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుని ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య ముఖ్య అతిథిగా హాజరై ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ ఊరేగింపు కార్యక్రమం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు, వాసవీ నగర్, యల్లారావు బజారు, గాంధీనగర్, జానపాడు రోడ్డు నుంచి ప్రధాన రహదారి మీదుగా టీటీడీ కల్యాణ మండపం వరకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా హాజరై శ్రీకృష్ణ ప్రతిమకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల కమిటీ అధ్యక్షుడు, సభ్యులు కటికం సైదారావు, శ్రీనివాస్‌రెడ్డి, కె.అరుణ, కె.కోటేశ్వరరావు, కె.నారాయణమ్మ, గోపి, టి.శ్రీను, ఎం.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మాచర్లలో...

వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ హనుమంతరావు శ్రీకృష్ణుని గొప్పతనం గురించి వివరించారు. మంచిని పంచి దుర్మార్గాన్ని ఎలా నశింపచేయాలో శ్రీకృష్ణుడు వివరించారన్నారు. ఇటువంటి పండుగలు మన సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతీకగా ఉంటాయన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు సందడి చేశారు. పలువురు విద్యార్థుల రాధా, కృష్ణుల వేష ధారణలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దాచేపల్లిలో...

దాచేపల్లి : కృష్ణాష్టమి వేడుకలు మండలంలో సోమవారం జరిగాయి. స్థానిక రంగనాయకస్వామి దేవాలయంలో అర్చకుడు కొసూరి రవికుమార్ పర్యవేక్షణలో శ్రీకృష్ణుడు, రంగనాయకస్వామి విగ్రహాలను ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. పలు చోట్ల కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

మాచవరంలో...

మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మండల కేంద్రమైన మాచవరంలో ఎస్ఐ సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొని, ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గంగిరెడ్డిపాలెం, కొత్త గణేశునిపాడు, పిల్లుట్ల, చెన్నాయపాలెం, శ్రీరుక్మిణీపురం, వేమవరం గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించగా, ఉట్టి కొట్టేందుకు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల వద్ద ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

రెంటచింతలలో...

రెంటచింతల: మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక శారదానగర్‌లోని రామకృష్ణ గురుకుల పాఠశాలలో శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు విశేషంగా ఆకట్టుకున్నారు. సాయంత్రం రామకృష్ణ సేవా సమితి, రామకృష్ణ గురుకులం ఆధ్వర్యంలో ఉట్ల స్తంభాల సెంటర్‌లో 75 మంది బాలబాలికలు కృష్ణుడి వేషధారణ పోటీల్లో పాల్గొన్నారు. వారందరికి కామన్ గిఫ్టలను అందజేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో చిన్నారులు, యువకులు ఉల్లాసంగా... ఉత్సాహంగా పాల్గొని పోటీ పడ్డారు. పల్నాటి ప్రసాదరావు, గొంటు ఆదిరెడ్డి, పల్నాటి సుబ్బారావు, బోడపాటి రామకృష్ణ విజేతలకు బహుమతులు అందజేశారు. రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు గుంటక కాశిరెడ్డి, పల్నాటి శివ, పల్నాటి రాముడు (అయోధ్య రాములు), నాళం పెదబాబు, పల్నాటి శివరామకృష్ణ, యేచూరి రాము తదితరులు పర్యవేక్షించారు.

విజయపురిసౌత్‌లో...

విజయపురిసౌత్: విజయపురి సౌత్ గ్రామంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు సీతారామాలయంలో సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పూజారి గుడిపూడి బ్రహ్మాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని యువకులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉట్టి కొట్టిన విజేత గ్రామానికి చెందిన గోన తిమోతికు ఆలయ కమిటీ సభ్యుల చేతులమీదుగా రూ.2,116 అందించారు. గ్రామానికి చెందిన చిన్నారి గౌతం కృష్ణ చిన్ని కృష్ణుని వేషధారణలో ఆలయంలోని పలువురు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి

పిడుగురాళ్ల: కృష్ణాష్టమి వేడుకలు పిడుగురాళ్ల పట్టణంలో సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ గుడి వద్ద వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీ జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్యలు హాజరయ్యారు. ముందుగా గంగమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువకులు ఉట్టి కొట్టేందుకు అధిక సంఖ్యలో హాజరయ్యారు. యువతులు యువకులపై నీళ్లు చల్లుతుండగా ఉట్టిని జంగా కృష్ణమూర్తి, జంగా వెంకట కోటయ్యలు లాగుతూ యువకులను ఉత్సాహపరిచారు. ఈ ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని తిలకించేందుకు ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. గంగమ్మ తల్లి దేవాలయం వద్ద ప్రతి ఏటా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘ నాయకులు, పట్టణ ప్రముఖులు, మహిళలు, యువతలు, యువకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చెన్నకేశవుని సన్నిధిలో కృష్ణాష్టమి వేడుకలు

కారెంపూడి: కృష్ణాష్టమి వేడుకలు పల్నాటి రణక్షేత్రమైన కారెంపూడిలో సోమవారం రాత్రి వైభవంగా జరిగాయి. మది నిండుగా పరమాత్ముని స్మరిస్తూ చిన్న, పెద్ద ఆడుతూ పాడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. భక్తులు, యువకులు భారీగా వైష్ణవమూర్తి చెన్నకేశవుని ఆలయానికి చేరుకున్నారు. చెన్నకేశవునికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బ్రహ్మనాయుడు నృసింహకుంతానికి మొక్కారు. శాస్త్రోక్తంగా ఆలయంలో అర్చకులు కొమండూరి సత్యనారాయణాచార్యులు పూజలు నిర్వహించారు. గ్రామ పెద కాపులు బొమ్మిన శ్రీనివాసరావు, బొమ్మిన కొండలరావు, యాదవ సంఘ పెద్దలు బడిగొడుగుల లచ్చయ్యల చేతుల మీదగా లాంఛనాలు పూర్తి చేశారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం చెన్నకేశవుని గరుడ వాహనంపై ఆశీనులను చేసి ఉట్టి కొట్టే ప్రదేశం వరకు స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం యాదవ యువకులు ఉట్టి లాగుతుండగా పెదకాపు బొమ్మిన కొండలరావు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని లాంఛనంగా నిర్వహించారు. పలువురు గ్రామ పెద్దలు, యాదవ సామాజిక వర్గ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



పిడుగురాళ్ల పట్టణంలో శ్రీకృష్ణుడి ఊరేగింపు కార్యక్రమం



దాచేపల్లి రంగనాయకస్వామి దేవాయలంలో...



మాచవరంలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్న యువకులు



సీతారామాలయంలో ఉట్టి కొడుతున్న యువకులు



రెంటచింతల ఉట్ల స్తంభాల సెంటర్‌లో ఉట్టి కొడుతున్న యువకులు



కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు



రెంటచింతల రామకృష్ణ గురుకుల పాఠశాలలో శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు



సీతారామాలయంలో చిన్ని కృష్ణుడి వేషధారణలో చిన్నారి

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



గురజాల : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ పాల్గొని మాట్లాడుతూ పండగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. శ్రీకృష్ణుడు ఉపదేశించిన గీతా సారాంశాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. మానవులంతా నిమిత్తమాత్రులమని జగన్నాటక సూత్రధారి సూచించిన మార్గంలో పయనించాలన్నారు. అనంతరం జన్మాష్టమి వేడుకలు ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీకృష్ణుడి విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో గాంధీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాలి వెంకటేశ్వర్లు, నాలి గురవయ్య, సిద్దాడపు మురారి, సిద్దాడపు రామారావు, సంకురాత్రి వెంకటేశ్వర్లు, బత్తుల పాపయ్య, మల్లాది ఏడుకొండలు, సంకుల వెంకటేశ్వర్లు, బి.ముక్కంటి యాదవ్ సోదరులు తదితరులున్నారు.



ఉట్టి కొడుతున్న యువకులు



చెన్నకేశవుని చెంత కృష్ణాష్టమి వేడుక



చెన్నకేశవుని గ్రామోత్సవం



ఉట్టి కొడుతున్న గ్రామ పెద కాపు

ఈ ప్రయాణం చాలా ప్రమాదకరం





రెంటచింతల మండలంలో పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలు

- నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా
- తీరుమార్చుకోని ఆటోవాలాలు, ప్రయాణికులు

రెంటచింతల: మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఎక్కువ మంది ప్రజలు తమ అవసరాల కోసం ఆటోలను ఆశ్రయిస్తున్నారు. మండలంలోని మంచికల్లు, రెంటాల, మిట్టగుడిపాడు, పాలువాయి, పశర్లపాడు, జెట్టిపాలెం, గోలి, మల్లవరం తదితర గ్రామస్తులు తప్పనిసరై ఆటోలను ఆశ్రయించి ప్రయాణిస్తున్నారు. ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. వివిధ ప్రాంతాలలో జరుగుతున్న ప్రమాదాలలో ఎక్కువగా ఆటో ప్రమాదాలే ఉంటున్నా... ప్రజలు తప్పక ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ప్రజలు కూడా తమ తీరు మార్చుకోకపోవడంతో ఆటోవాలాలు ఇష్టానుసారం పరిమితికి మించి కిక్కిరిసేలా సుమారు 20 మంది ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. కనురెప్ప కాలంలో జరుగుతున్న ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి. ఒక్కో ఆటో పుష్పక విమానాన్ని తలపిస్తూ గుంతలతో అధ్వానంగా ఉన్న రహదారులపై ప్రమాదం అంచున ప్రయాణిస్తున్నాయి. కొందరు ట్రాక్టర్ ట్రక్కుకు ఉన్న మూడు వైపుల డోర్లను తెరిచి వ్యవసాయ కూలీలను ప్రమాద భరితంగా పనులకు తీసుకువెళ్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

ఆటోవాలాలకు అవగాహన కల్పిస్తున్నాం



పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంపై ఆటోవాలాలకు, ద్విచక్ర వాహనంపై త్రిపుల్ రైడింగ్ చేయడం ఎప్పుడైనా ప్రమాదకరం అని వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. వాహనాలు నడుపుతున్న మైనర్ల తల్లిదండ్రులకు కూడా కచ్చితంగా ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తాం. ట్రాఫిక్ నిబంధనలు పాటించని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటోవాలాలను హెచ్చరిస్తూ కేసులు నమోదు చేస్తున్నాం.

– సీహెచ్ నాగార్జున ఎస్ఐ, రెంటచింతల

కంకర లారీ కింద పడి మరో కూలీ..

ఈపూరు: ప్రమాదవశాత్తు కంకర లారీ కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొండ్రముట్ల సమీపంలోని నూతనంగా ఏర్పాటు చేస్తున్న వెంచరులో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు మేరకు సిమెంటు పనులు చేస్తుండగా చోలాయపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు (40) కంకర లారీ టైర్ల కింద పడి నుజ్జునుజ్జయ్యాడు. ఎస్సై ఉమామహేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరాలు



క్రోసూరు: మండలంలోని ఊటుకూరు, బయ్యవరం గ్రామాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఊటుకూరు వైద్య శిబిరంలో 66 మందికి వైద్య పరీక్షలు చేయగా ఆరుగురు జ్వరంతో బాధపడుతున్నట్లు నిర్ధారణ చేశారు. బయ్యవరంలో 36 మందికి వైద్య పరీక్షలు చేయగా ముగ్గురు జ్వరంతో బాధపడుతున్నట్లు నిర్ధారించి మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరాల్లో ఏఎన్ఎం లక్ష్మీ, బయ్యవరంలో ఏఎన్ఎం మరియమ్మ, హెల్త్ అసిస్టెంట్ ప్రేమరాజు, ఎంఎల్‌హెచ్‌పీ శివుడు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మినుము పైరుకు వైఎంవీ వైరస్



రొంపిచర్ల: మండలంలోని సంత గుడిపాడు గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మినుము పంటను డీడీఏ శివకుమారి సోమవారం పరిశీలించారు. మినుము పైరుకు వైఎంవీ వైరస్ సోకినట్లు గుర్తించారు. ఎల్లోవేయిన్ మొసాయిక్ వైరస్ నివారించేందుకు రైతులకు ఆమె పలు సూచనలు చేశారు. తెగులు సోకిన మొక్కలను తొలగించాలన్నారు. వైరస్ నివారణకు పసుపురంగు జిగురు అట్టలను పొలంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. అసెటమీప్రైడ్ మందును పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వీరివెంట ఏడీఏ మస్తానమ్మ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా సేవలు మరువలేనివి



థెరిసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ నరసింహారావు, సేవా సమితి సభ్యులు

వెల్దుర్తి: స్వర్గీయ మదర్ థెరిసా జయంతిని సోమవారం మాచర్ల పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా థెరిసా విగ్రహానికి మాచర్ల మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, థెరిసా సేవా సమితి అధ్యక్షులు కసిరెడ్డి శాంతిరెడ్డి, సభ్యులు జక్కిరెడ్డి చిన్నపరెడ్డి, పాపిరెడ్డి, జోజిలు పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న సూక్తికి కట్టుబడి ఎంతో మంది అనాథలు, వృద్ధులు, కుష్టు రోగులకు సేవలు చేసిన ఘనత ఆమెదేనన్నారు. ఆమె బాటలో నడుస్తున్న సేవా సమితి సభ్యులను అభినందించారు. మదర్ థెరిసా విశ్వమాతగా గుర్తింపు పొందారన్నారు. ఆమెను భారతరత్న అవార్డుతో ప్రభుత్వం గుర్తించిందని, ఆమె సేవలు ఎప్పటికీ మరువలేమన్నారు. పలువురు ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా సమితి సభ్యులు కిరీటిరెడ్డి, చిలంకూరి నాగిరెడ్డి, ముత్యాల పాపిరెడ్డి, అందుగుల చంద్రయ్య, కసిరెడ్డి శాంతిరెడ్డి, శ్రీనివాస రెడ్డి, హనుమంతరావు, కేళం ఆదినారాయణ, పాండు రంగారావు, ఉప్పుతోళ్ళ రమేష్, సెయింట్ ఆన్స్ విద్యా సంస్థల హెచ్ఎం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.